
# సాక్షి
## డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 8 । జూలై । 2023



### డెల్టాలకు 8,600 క్యూసెక్కులు
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,600 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 2,390, సెంట్రల్ 1,710, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.75 అడుగులుగా ఉంది.



### శ్రీవారిని దర్శించుకున్న డీఐజీ
దేవరపల్లి: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారిని డీఐజీ అశోక్‌కుమార్ గురువారం రాత్రి దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
33.5° / 25.0°

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 33.5 | 26.0 |
| కాకినాడ | 32.5 | 25.0 |
| అమలాపురం | 32.0 | 27.0 |



ఉచిత విద్యుత్‌తో పంట చేనుకు ఊపిరి

# చెదరని జ్ఞాపకం..
# చెరగని సంతకం

- నేడు వైఎస్సార్ జయంతి.. రైతు దినోత్సవం
- ఆ మహానేత ఐదేళ్ల పాలనలో అన్నదాతకు పెద్దపీట
- గోదావరి డెల్టా ఆధునీకరణకు శ్రీకారం
- వ్యవసాయ ఉచిత విద్యుత్‌తో ఎంతో మేలు
- అడుగడుగునా రైతులకు వెన్నుదన్ను



వ్యవసాయమే దండగంటూ.. మట్టి వాసనంటేనే గిట్టని 'పచ్చ' పాలకుల ఏలుబడితో.. దైన్యం నిండిన మట్టి మనుషుల గుండెల్లో ఆయన ధైర్యం నింపారు. ఈ నేల అడుగడుగునా అడుగులు వేస్తూ.. అన్నదాతల దీనావస్థను నిండు మనసుతో అర్థం చేసుకున్నారు. మట్టిని నమ్ముకున్న మనిషి బాగుంటేనే అందరూ బాగుంటారని త్రికరణ శుద్ధిగా నమ్మారు. అధికార పగ్గాలు చేపట్టాక.. అన్ని వర్గాల ప్రగతికీ తోడ్పాటు నందిస్తూనే.. ఆరుగాలం చెమట చుక్కలు చిందిస్తూ.. బంగారు పంటలు పండించే అన్నదాతలకు చేయూతనందించారు. ఆ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి.. రైతు పక్షపాతిగా వారి మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన రైతుహిత కార్యక్రమాలు.. తీసుకున్న నిర్ణయాలు.. కోనసీమ ప్రగతి పుటలపై ఎప్పటికీ చెరగని సంతకాలే.. ఆ మహానేత అడుగుజాడలు ఎన్నటికీ చెదరని జ్ఞాపకాలే.. నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి. ఈ రోజును రాష్ట్ర ప్రభుత్వం రైతు దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఈ ప్రాంతానికి ఆ మహానేత అందించిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకుంటున్నారు. – సాక్షి, అమలాపురం

### డెల్టా ఆధునీకరణకు పెద్దపీట

సర్ ఆర్థర్ కాటన్ చేతిలో రూపు దిద్దుకున్న గోదావరి డెల్టా వ్యవస్థకు నాటి ప్రభుత్వాలు చిన్న చిన్న మరమ్మతులు, క్లోజర్ పనులు మినహా పెద్దగా ఆధునీకరణ పనులు చేపట్టలేదు. కానీ, నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.1,160 కోట్లతో పంట కాలువలు, రూ.550 కోట్లతో మురుగునీటి కాలువల ఆధునీకరణ పనులు చేపట్టారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల పరిధిలోని సుమారు 10.60 లక్షల ఎకరాల వరి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందేందుకు.. పంటచేల నుంచి ముంపు నీరు దిగేందుకు ఆయన చర్యలు చేపట్టారు. వైఎస్సార్ బతికి ఉండగా వేగంగా జరిగిన పనులు ఆయన మృతితో అటకెక్కాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా కొత్తగా 7.50 లక్షల ఎకరాల ఆయకట్టు తీసుకు వచ్చేందుకు, డెల్టాలో 10.60 లక్షల ఎకరాల గోదావరి ఆయకట్టు స్థిరీకరణకు చర్యలు చేపట్టారు.



గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు

### ఎన్నో విధాలుగా మేలు

- వైఎస్సార్ శ్రీకారం చుట్టిన ఉచిత వ్యవసాయ విద్యుత్ వల్ల జిల్లాలోని ఉద్యాన రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ముఖ్యంగా కొబ్బరి, అరటి, పసుపు, కూరగాయ పంటలు సాగు చేసే రైతులకు ఉచిత విద్యుత్ చేస్తున్న మేలు అంతా ఇంతా కాదు. జిల్లాలో మొత్తం 20,452 వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉండగా, వీటిలో 11,901 పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందుతోందంటే అందుకు వైఎస్సారే కారణం.
- గోదావరి డెల్టాలో ఏటిగట్ల పటిష్టత పనులకు రూ.550 కోట్లు, గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల నిర్మాణాలకు రూ.90 కోట్లు కేటాయించారు. దీనివల్ల నదీ కోత నివారణతో పాటు గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలకు మేలు జరిగింది.
- 2008–09 రబీలో గోదావరి డెల్టాలో నీటి ఎద్దడి ఏర్పడింది. అప్పట్లో సీఎం హోదాలో రాజమహేంద్రవరం వచ్చిన వైఎస్సార్ పరిస్థితి అర్థం చేసుకున్నారు. నీటి ఎద్దడి నివారణకు రూ.7.50 కోట్లతో తక్షణ చర్యలు తీసుకున్నారు. డ్రెయిన్లపై క్రాస్‌బండ్‌ల ఏర్పాటు, కాలువల్లోని నీటిని మోటార్లతో చేలకు మళ్లించడంతో పాటు గోదావరిలో వృథా నీటిని పంట కాలువలకు మళ్లించేలా చర్యలు చేపట్టారు. తదనంతర కాలంలో ఎప్పుడు నీటి ఎద్దడి వచ్చినా, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇదే విధానంతో రబీని గట్టెక్కిస్తూండటం విశేషం.
- 2007లో కొబ్బరి సంక్షోభంలో ఉంది. నాడు కోనసీమ రైతులు స్వయంగా కలిసి చేసిన విజ్ఞప్తికి వైఎస్సార్ స్పందించారు. కొత్త కొబ్బరి(తయారీ కొబ్బరి)పై 2 శాతం వ్యాట్ మినహాయింపు ఇచ్చారు. మరో సందర్భంలో కేజీ రూ.9.20 చేసి కొబ్బరి కాయను మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేయించారు.

### తండ్రి బాటలోనే తనయుడు సీఎం జగన్

- వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖరీఫ్, రబీ సమయంలో పంట పెట్టుబడికి ఇబ్బంది లేకుండా జిల్లాలోని సుమారు 1.60 లక్షల మంది రైతులకు నాలుగేళ్లుగా ఏటా క్రమం తప్పకుండా రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతుభరోసా నిధులు ఇస్తున్నారు.
- జిల్లాలో 377 రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వీటి ద్వారా గ్రామంలోనే నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అగ్రి ల్యాబ్‌లు, ఆక్వా ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
- మార్కెట్ కమిటీల ఆధ్వర్యాన గోడౌన్ల నిర్మాణాలు చేపట్టారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ప్యాక్‌హౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు, కలెక్షన్ సెంటర్లను రాయితీలపై నిర్మిస్తున్నారు.
- టీడీపీ హయాంలో మాయమైన సున్నా వడ్డీ రాయితీ, పావలా వడ్డీ రాయితీ రుణాలను పునరుద్ధరించారు. ధాన్యం నేరుగా కొనుగోలు చేయడం ద్వారా రైతులకు కనీస మద్దతు ధర వచ్చేలా చేస్తున్నారు.
- జిల్లాలో 11,901 మోటార్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. దీనివల్ల కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలతో పాటు మెరకలోని వరి రైతులకు మేలు జరుగుతోంది. దీంతో పాటు 4,227 ఆక్వా సర్వీసులకు రాయితీపై యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నారు.



కొత్తపేట మండలం అవిడిలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం

### అన్ని రకాల రైతులకూ మేలు



వరి, కొబ్బరి, ఆక్వా, వెటర్నరీ, పౌల్ట్రీ అనే తేడా లేదు. ప్రతి రైతుకూ వైఎస్సార్ మేలు చేశారు. ఉచిత విద్యుత్ వల్ల మెట్ట రైతులకే కాదు.. డెల్టాలోని ఉద్యాన రైతులకు కూడా చాలా మేలు జరిగింది. రైతులకు ఆయన చేయనిదంటూ ఏదీ లేదు. అందుకే మరణించి ఇన్నేళ్లవుతున్నా వైఎస్సార్ రైతులోకం మరచిపోలేదు.

– గొలుగూరి మునిరెడ్డి, రైతు, రావులపాలెం

### రైతులు కోరిన వెంటనే..



తయారీ కొబ్బరిపై ట్యాక్స్ ఎత్తివేయమని వైఎస్సార్‌ను వ్యాపారులు చాలాసార్లు అడిగారు. కానీ, రైతులు కోరిన వెంటనే ట్యాక్స్ ఎత్తివేస్తూ జీఓ జారీ చేశారు. నేరుగా కొబ్బరికాయ కొనుగోలు చేయించారు. ఉచిత విద్యుత్ వల్ల ప్రధానంగా కొబ్బరి రైతుకు మేలు జరిగింది.

– ముత్యాల జమ్మి, రైతు, డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, అంబాజీపేట మండలం

### అడగడమే ఆలస్యం



వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈగా ఉన్నాను. డెల్టా ఆధునీకరణ, ఏటిగట్ల పటిష్టత, లంక గ్రామాలకు గ్రోయిన్ల నిర్మాణం.. ఇలా అడగడమే ఆలస్యం.. ఆగమేఘాల మీద అనుమతులు మంజూరు చేసేవారు. 2009లో నీటి ఎద్దడి నివారణకు తీసుకున్న చర్యలనే తరువాత వస్తున్న ప్రభుత్వాలు, ఇరిగేషన్ అధికారులు అమలు చేస్తున్నారంటే వైఎస్సార్ వేసిన పునాదే కారణం.

– విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా పరిషత్ చైర్మన్

## ఆఖరి లబ్ధిదారుకూ మేలు చేయడమే లక్ష్యం



రామచంద్రపురంలో లబ్ధిదారుకు రేషన్ కార్డు అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు



అమలాపురంలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి విశ్వరూప్. చిత్రంలో ఎమ్మెల్సీ కుడుపూడి తదితరులు

- మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణు
- 'జగనన్న సురక్ష'లో ధ్రువపత్రాల అందజేత

అమలాపురం టౌన్/రామచంద్రపురం: ఎవరికైనా ఏవైనా కారణాలతో సంక్షేమ పథకాలు అందకపోతే ఆఖరి లబ్ధిదారును కూడా గుర్తించి మేలు చేయడమే 'జగనన్న సురక్ష' లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. అమలాపురం సూర్య నగర్, రామచంద్రపురం గంగుమళ్లవారి వీధి సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని అన్నారు. అమలాపురంలో గొల్లగూడెం, సూర్య నగర్ వార్డు సచివాలయాలకు సంబంధించి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత ధ్రువ పత్రాలను మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## చమురు, గ్యాస్ రవాణాతో ప్రజలకు నష్టం వాటిల్లరాదు

- పైప్‌లైన్ ఆడిట్‌లో గుర్తించిన లోపాలు సరి చేయాలి
- కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



కన్వర్జెన్సీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: చమురు, గ్యాస్ నిక్షేపాల రవాణా, పైప్‌లైన్ ద్వారా సరఫరాలో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆయా సంస్థలను ఆదేశించారు. చమురు, సహజ వాయువుల వలన ఏర్పడే హానికారక రసాయన ప్రమాదాలు – అత్యవసర ప్రణాళిక, సంసిద్ధత – ప్రతిస్పందనపై డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా క్రైసిస్ గ్రూపు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చమురు, సహజ వాయు సంస్థల ప్రతినిధులు పైపులైన్లపై తరచుగా మూడో పార్టీ ఆడిట్ నిర్వహించి, గుర్తించిన లోపాలను ఎప్పటికప్పుడు సరి చేయాలని చెప్పారు. నలభయ్యేళ్ల కిందట వేసిన పైప్‌లైన్లు తరచుగా లీకవుతూండటంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పైప్‌లైన్లను నిర్వహించాలని రిలయన్స్, ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలను ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలను ఎదుర్కొనేందుకు వీలుగా అన్ని విభాగాల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, మాక్‌డ్రిల్ చేపట్టాలని అన్నారు. చమురు సంస్థల నిర్లక్ష్యం వలన ప్రజలకు ప్రాణాపాయం కలిగితే క్రిమినల్ కేసులు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 17 చమురు, సహజవాయు సంబంధిత ప్రాంతాలున్నాయని, అలాగే రావులపాలెం మండలం ఈతకోటలో నాగార్జున కెమికల్స్ ఫ్యాక్టరీ ఉందని వీటి నుంచి వెలువడే హానికారక రసాయనాల వల్ల హాని జరిగే అవకాశం ఉందని అన్నారు. పైప్‌లైన్లపై ఆన్‌లైన్ పర్యవేక్షణ ఉండాలని ఓఎన్‌జీసీ ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో గెయిల్ 430 కిలోమీటర్లు, ఓఎన్‌జీసీ 120 కిలోమీటర్లు, రిలయన్స్ 36 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు నిర్వహిస్తున్నాయని కలెక్టర్ చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందనపై డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మాతా శిశు మరణాల రేటు తగ్గించాలి

జిల్లాలో మాతా శిశు మరణాల రేటు తగ్గించడం, గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపాలను చక్కదిద్దడంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పూర్తి సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన స్త్రీ, శిశు సంక్షేమం, వైద్య, ఆరోగ్య శాఖల కన్వర్జెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలు, గర్భిణులకు ఇంటికే సరఫరా చేస్తామని చెప్పారు. సకాలంలో వైద్యులు విధులకు హాజరై, సేవలందించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి పద్మశ్రీరాణి, డీఎంహెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర, జిల్లా స్త్రీ, సంక్షేమ శాఖ అధికారి జీవీ సత్యవాణి, ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ అధికారి డాక్టర్ సుమలత, సచివాలయం నోడల్ అధికారి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### డీ అడిక్షన్ కేంద్రంలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రంలో 15 పోస్టులను ఏడాది కాలానికి తాత్కాలిక పద్ధతిన భర్తీ చేస్తున్నట్టు డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్, సైకియాట్రిస్ట్, మేనేజర్ కం ఇన్‌చార్జి, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్, ఔట్‌రీచ్ వర్కర్ అండ్ ఫాలో అప్ సూపర్‌వైజర్, కౌన్సిలర్/సోషల్ వర్కర్/సైకాలజిస్ట్, ట్రైనర్ కం సూపర్‌వైజర్ ఆఫ్ పీర్స్ అండ్ కమ్యూనిటీ మొబైల్, నర్స్, వార్డ్ మహిళలు, యోగా థెరపిస్ట్/డ్యాన్స్/మ్యూజిక్/ఆర్ట్ టీచర్, హౌస్ కీపింగ్ వర్కర్ పోస్టులు పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. తగిన అర్హత, అనుభవం, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌ఓ తెలిపారు.

### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి రిమాండ్

అల్లవరం: బోడసకుర్రు టిడ్కో భవనాల వద్ద గృహ నిర్మాణ సంస్థ గోదాములో ఉంచిన స్టీల్‌ను అమ్మేసిన కేసులో నిందితుడికి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. డీఎస్పీ అంబికా ప్రసాద్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. అంబాజీపేట మండలం పాలగుమ్మి గ్రామానికి చెందిన సరెళ్ల ఏడుకొండలు వెంకటరమణ గృహ నిర్మాణ శాఖ గోదాములో ఔట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అధికారుల కళ్లుగప్పి 36 టన్నుల స్టీల్ (ఐరన్) అధికారుల కన్ను గప్పి వేరేవారికి అమ్మేశాడు. దీనిపై గృహ నిర్మాణ సంస్థ మండల ఇన్‌చార్జి శ్రీధర్ గత నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ వీరబాబు నేతృత్వంలో అల్లవరం ఎస్సై శ్రీనునాయక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. నిందితుడు వెంకట రమణ నుంచి రూ.18 లక్షల విలువైన 25 టన్నుల ఐరన్ రికవరీ చేశారు.

### రూ.1,01,116 విరాళం



దాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న సిబ్బంది

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదానానికి మంగిపూడి భాస్కరశర్మ (రాజా) జ్ఞాపకార్థం మంగిపూడి సీతారామలక్ష్మి, ఆమె కుమారుడు వెంకట సత్య సుబ్రహ్మణ్య ప్రసాద్ (పి.గన్నవరం మండలం నరేంద్రపురం) శుక్రవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

# అన్నదాతకు బీమానందం

- నేడు వైఎస్సార్ పంటల బీమా జమ
- జిల్లాలో పంటలు నష్టపోయిన 28,595 మందికి పరిహారం
- రూ.20.42 కోట్ల మేర నేడు జమ
- వరికి రూ.9.99 కోట్లు
- అరటికి రూ.10.43 కోట్ల మేర చెల్లింపులు



కొత్తపేట: కష్టనష్టాల్లో అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. గత ఏడాది ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పరిహారం జమ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 2022 ఖరీఫ్‌లో 25,188.27 ఎకరాల విస్తీర్ణంలో దెబ్బ తిన్న వరి, అరటి పంటలకు సంబంధించి 28,595 మంది రైతులకు రూ.20,42,53,604 బీమా పరిహారం జమ చేయనున్నారు. ఇందులో దిగుబడి ఆధారంగా 9,352.27 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటకు సంబంధించి 15,279 మంది రైతులకు రూ.9,99,40,945 చెల్లిస్తున్నారు. అలాగే, 15,836 ఎకరాల విస్తీర్ణంలో దెబ్బ తిన్న అరటి పంటకు సంబంధించి 13,316 మంది రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద రూ.10,43,12,659 పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

**నాడు జిల్లా.. నేడు మండలం యూనిట్‌గా..**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బీమా పరిహారాన్ని జిల్లా యూనిట్‌గా చెల్లించేవారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంతా ఒక యూనిట్‌గా చేయడం వల్ల గోదావరి వరదలు, తుపాన్ల సమయంలో రైతులకు బీమా పరిహారం తక్కువగా వచ్చేది. దీంతో కోనసీమ పరిధిలోని రైతులు.. ముఖ్యంగా అరటి రైతులు ఎక్కువగా నష్టపోయేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బీమా పరిహారాన్ని మండలం యూనిట్‌గా నిర్ణయిస్తున్నారు. దీంతో పంట నష్టపోయిన అరటి రైతులందరికీ పరిహారం దక్కుతోంది. దీంతో అరటి రైతుల్లో ఆనందం వెల్లి విరుస్తోంది.

**నియోజకవర్గాల వారీగా అరటి పంటకు మంజూరైన బీమా**

| నియోజకవర్గం | విస్తీర్ణం (ఎకరాలు) | మొత్తం రైతులు | చెల్లిస్తున్న బీమా (రూ.లలో) |
|---|---|---|---|
| కొత్తపేట | 9,537.01 | 8,259 | 6,34,97,465 |
| పి.గన్నవరం | 4912.15 | 3,906 | 2,75,99,559 |
| మండపేట | 757.29 | 674 | 62,02,651 |
| అమలాపురం | 384.81 | 314 | 48,79,479 |
| రామచంద్రపురం | 179.23 | 157 | 14,84,745 |
| ముమ్మిడివరం | 65.86 | 51 | 6,48,760 |

**గతంలో నిబంధనలు ఇలా..**

- అరటి పంట బీమా పథకంలో జిల్లాను యూనిట్‌గా పరిగణించేవారు. రాడార్ డేటా ప్రకారం 43 డిగ్రీల సెల్సియస్‌కు పైబడి ఉష్ణోగ్రతలు, వడగాల్పులు, వరుసగా నాలుగు రోజులు జిల్లా అంతటా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదై, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తేనే పంట నష్టపోయినట్టు గుర్తించేవారు.
- అప్పట్లో రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలయ్యేది. పంట నష్టం జరిగిన తరువాత కంపెనీ రాడార్‌లో ఎటువంటి డేటా రాలేదని చెప్పి తప్పించుకునేవారు.
- బీమా పథకాన్ని అప్పట్లో ప్రైవేటు కంపెనీలకు అప్పగించారు. దీంతో ఏ కంపెనీ ప్రతినిధీ క్షేత్ర స్థాయికి వచ్చి ఒక్క రైతుకు కూడా భరోసా ఇచ్చేవారు కాదు. బాధ్యత తీసుకున్న ఉద్యాన అధికారులు క్షేత్ర స్థాయిలో రైతుల ఆగ్రహానికి గురయ్యేవారు.
- అరటి పంటల బీమా ప్రీమియం ఎకరాకు ఏకంగా రూ.2 వేలు ఉండేది. చాలా మంది సన్న, చిన్నకారు రైతులు అంత మొత్తం చెల్లించలేకపోయేవారు.
- ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగా ఆగస్టు నుంచి నవంబరు మధ్య సంభవిస్తాయి. బీమా డిసెంబర్ నుంచి జూన్ వరకూ వర్తించేది. దీంతో రైతులకు పెద్దగా ఏమీ ఒరిగేది కాదు.



కొత్తపేటలో భారీ వర్షాల ముంపుకు గురైన అరటి తోట (ఫైల్)

**ప్రస్తుత ప్రభుత్వ హయాంలో..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తోంది. జిల్లా అరటి రైతుల అభ్యర్థనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, నాటి వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల మంత్రి కురసాల కన్నబాబు తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం అరటిని వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిధిలోకి తీసుకువచ్చింది. అలాగే నష్టాల నమోదు జిల్లా యూనిట్‌గా కాకుండా మండల స్థాయికి మార్చారు. దీనివల్ల వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతోంది.

### సీఎం జగన్ చేసిన మేలును రైతులు మర్చిపోరు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును రైతులకు.. ముఖ్యంగా అరటి రైతులు ఎప్పటికీ మర్చిపోరు. నాకు రూ.40 వేల పరిహారం మంజూరైంది.

– పెదపూడి బాపిరాజు, అరటి రైతు, రైతుసంఘం అధ్యక్షుడు, వాడపాలెం, కొత్తపేట మండలం

## ఏయూలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం



కొత్తపేట శిల్పశాలలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంతో శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) ప్రాంగణంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని నెలకొల్పనున్నారు. ఈ విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన ప్రముఖ జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ రూపొందించారు. వైఎస్ జయంతి సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరిస్తారని రాజ్‌కుమార్ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఏయూ తరఫున విగ్రహావిష్కరణ కమిటీ సభ్యుడు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ఇచ్చిన ఆర్డర్ మేరకు వైఎస్ విగ్రహాన్ని తయారు చేశానని చెప్పారు. ఈ విగ్రహాన్ని ఏడున్నర అడుగుల ఎత్తున ఎంతో ప్రతిష్టాత్మకంగా తయారు చేశానని వుడయార్ తెలిపారు.

## నగల దుకాణంలో అగ్ని ప్రమాదం

పెద్దాపురం: స్థానిక మెయిన్ రోడ్డులోని జల్లూరి వీర్రాజు జ్యూయలర్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. పెద్దాపురం అగ్నిమాపకాధికారి శ్రీహరి జగన్నాథ్ కథనం ప్రకారం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భవనం పై అంతస్తు నుంచి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

# ఇన్‌స్పైర్ చేసేద్దామా!

- సృజనాత్మక ఆవిష్కరణలకు ఆహ్వానం
- ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్టుల రూపకల్పనకు సమయం ఆసన్నం
- నమోదుకు ఆగస్టు 31 తుది గడువు

రాయవరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ వేడుక వేదికగా నిలుస్తోంది. మూస విధానాలు, ఒకరిని చూసి మరొకరు ప్రయోగాలు అనుకరించకుండా ఉండేలా నూతన ఆవిష్కరణలకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు, వారి ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. ప్రతి తరగతి నుంచి ఒకరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే అవకాశముంది. 2008–09 నుంచి ఏటా ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు నిర్వహిస్తున్నారు.

### ప్రాజెక్టులను పంపండిలా..

విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను www.inspireawards&dst.gov.in <http://www.inspireawards&dst.gov.in> వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా ఆగస్టు 30వ తేదీ లోపు నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థీ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తన ప్రాజెక్టును ప్రదర్శించేందుకు రూ.10 వేల పారితోషికం చెల్లిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి, జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలు తమ ప్రాజెక్టును మెరుగు పరచుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ రూ.25 వేల వరకూ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంటుంది. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యాన్ని 96401 88525 నంబరులో ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు.

### దరఖాస్తు చేయాలిలా..

- తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను తీర్చేదిగా ఆ ఆలోచన ఉండాలి.
- తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, అందుకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి.
- విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి, విద్యార్థి బ్యాంకుఖాతా, ఆధార్‌నంబరు ఎంటర్ చేయాలి.
- ప్రాజెక్టు వివరాలను రాతపూర్వకంగా సంక్షిప్తంగా పొందుపరచి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.
- ప్రాజెక్టు పేరు, శాస్త్ర, సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రాజెక్టు ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు.
- ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు.

### గత విద్యా సంవత్సరంలో..

ఉమ్మడి జిల్లాకు సంబంధించి గత విద్యా సంవత్సరంలో 5,400 ప్రాజెక్టులు రూపొందించగా 278 ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికై, రూ.10 వేల నగదుకు అర్హత సాధించాయి. వీటిలో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి 28 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. అయితే, వీటిలో జాతీయ స్థాయికి ఒక్క ప్రాజెక్టు కూడా ఎంపిక కాలేదు. ఈ ఏడాది ప్రతి జిల్లా నుంచీ అధిక సంఖ్యలో ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆయా జిల్లాల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులకు వెబెక్స్ నిర్వహించడంతో పాటు, సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతి నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి కనీసం మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు చొప్పున ప్రాజెక్టులు రూపొందించాలి.

### ఆలోచనలకు పదును పెట్టాలి



విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుని బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చక్కటి అవకాశం. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలకు పదును పెడితే, ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతమవుతాయి. ప్రాజెక్టుల రూపకల్పనపై త్వరలోనే సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

### చొరవ చూపాలి



ఇన్నోవేషన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపేందుకు ఇది మంచి అవకాశం. ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలి. జిల్లా నుంచి అత్యధికంగా నామినేషన్లు నమోదయ్యేలా చూడాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో గొప్పగొప్ప శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశం లభిస్తుంది.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

### విద్యార్థులను ప్రోత్సహించాలి



ప్రాజెక్టులు తయారు చేసేలా విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. అవకాశాన్ని అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. రాష్ట్ర స్థాయిలో పోటీ పడే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

# పేదలను ఆదుకునే పెద్ద మనసు జగన్‌ది

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఎస్.అన్నవరం–3లో జగనన్న సురక్ష



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: పేదలను ఆదుకునే పెద్ద మనసు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని.. దీనికి భిన్నంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల నుంచి విరాళాల సేకరణకు జోలి పట్టే గుణం టీడీపీ నేత చంద్రబాబుదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం –3 (కొత్త సూరవరం) సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ, 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు 600 హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టాక వాటిని నెరవేర్చడానికి డబ్బు లేదని, ఆర్థిక వ్యవస్థ బాగోలేదంటూ పంచాయతీల్లో హుండీలు, అమరావతిలో చందాలు వసూలు చేసిన చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి ప్రజల మనసులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం పొందారని అన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. నాయకులు, అధికారుల వద్ద డబ్బుంటే బీరువాల్లో చేరుతుందని.. అదే పేదల వద్ద ఉంటే ఖర్చు చేయడం ద్వారా వ్యాపారాలు, పరిశ్రమల్లో డబ్బు చలామణి అయి ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుందని విశ్లేషించారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి అవుతుందని మంత్రి రాజా చెప్పారు. 2016లో రైలును దగ్ధం చేసిన ఘటనలో వందలాది మందిపై తప్పుడు కేసులు బనాయించిన టీడీపీ.. 1988లో వంగవీటి మోహనరంగాను టీడీపీ నాయకులు హత్య చేయించి కేసులు పెట్టారని గుర్తు చేశారు. తునిలో 1989లో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని టీడీపీ నాయకులు తొలగించేస్తే.. దానిని సూరవరంలో ప్రతిష్ఠించారని చెప్పారు. అటువంటి టీడీపీ నాయకులు సిగ్గు లేకుండా రంగా విగ్రహానికి పూలమాలలు వేశారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుళ్లు, కుతంత్రాలతో శకునిలా రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గ ప్రజలకు దూరంగా హైదరాబాద్‌లో ఉంటూ, తన కుమార్తెను గెలిపించాలంటూ ఆయన తిరుగుతున్నారని విమర్శించారు. యనమల కుమార్తె గెలిస్తే భర్త దగ్గర బెంగళూరులో ఉంటారని చెప్పారు. టీడీపీ నాయకుల మొసలి కన్నీరుకు మోసపోవద్దని మంత్రి రాజా విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు ప్రారంభం

- 9 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారుల రాక
- మూడు రోజుల పాటు 12 విభాగాల్లో పోటీలు



టీటీ పోటీలను ప్రారంభిస్తున్న భాస్కర్‌రామ్ తదితరులు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) పోటీలు గోదావరి గట్టున ఉన్న శ్రీ త్యాగరాజ సేవా సమితి ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.భాస్కర్‌రామ్, చిట్టూరి విజయప్రకాశ్, కార్యదర్శి పి.విశ్వనాథ్ ఈ పోటీలను ప్రారంభించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్–11, 13, 15, 17, 19 బాల బాలికలు, పురుషులు, స్త్రీలు కలిపి మొత్తం 12 విభాగాల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం 10 టేబుళ్లపై జరిగే ఈ పోటీల్లో తూర్పు గోదావరితో పాటు గుంటూరు, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హోరాహోరీ తలపడనున్నారు. ఒక చీఫ్ రిఫరీ, ఇద్దరు అసిస్టెంట్ రిఫరీలు, 20 మంది అంపైర్లతో ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజైన ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు, మెడల్స్ అందించనున్నారు. పాయింట్ల ఆధారంగా విజేతలు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు తెలిపారు.



## జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చలమలశెట్టి సునీల్ చారిట్రబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయంలో రెండు రోజుల జాబ్‌మేళాను ఆయన శుక్రవారం ప్రారంభించారు. దీనికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ, 70 కంపెనీలకు సంబంధించి 3 వేలకు పైగా ఉద్యోగాల కల్పనకు ఈ మేళా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తొలి రోజు 4,300 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా 3 వేల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. మిగిలిన వారితో పాటు శనివారం కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కూడా ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారికి ఆయా సంస్థలు ఉద్యోగాలు కల్పిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, టీపీఓ ఎ.కరుణ, శ్యామ్‌కుమార్, ట్రస్ట్ చైర్మన్ రెడ్డం దుర్గాప్రసాద్, డీఏపీ మురళీకృష్ణ, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ వి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్ ఓరియెంటేషన్‌తో డిగ్రీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డిగ్రీలో సివిల్స్ ఓరియెంటేషన్ ప్రారంభించనున్నట్లు శ్రీ షిర్డి సాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, తమ డాఫ్నే సివిల్స్ అకాడమీ ద్వారా సివిల్స్ శిక్షణ ఇవ్వనున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. 21 సంవత్సరాలకే ఐఏఎస్ లేదా ఐపీఎస్ సాధించడం, సివిల్స్ ఓరియెంటేషన్‌తో ఇతర ప్రయోజనాలు, డిగ్రీలో ఏ గ్రూపు చదివితే సివిల్స్ సాధించగలం వంటి అనేక సందేహాలను ఈ సదస్సులో నివృత్తి చేయనున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సదస్సుకు హాజరు కావచ్చని, వివరాలకు 95812 71119 నంబరులో సంప్రదించాలని శ్రీవిద్య కోరారు.

## 'నన్నయ'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు 360 మంది హాజరు



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరైన అభ్యర్థులకు సూచనలిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కెమిస్ట్రీ, ఫార్మసీ విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు గోదావరి జిల్లాల నుంచి 360 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కంట్రోల్, క్వాలిటీ ఎసెస్మెంట్, ప్రొడక్షన్ విభాగాల్లో ఉద్యోగాలకు హైదరాబాద్ పెట్రో గ్రూప్స్ సంస్థ వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించిందని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరించారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు రాత పరీక్ష నిర్వహించారు. దీనిలో అర్హత సాధించిన వారి జాబితా ఆన్‌లైన్‌లో తెలియజేస్తామని, అనంతరం తుది ఇంటర్వ్యూలు చేసి, ఎంపికలు చేపడతామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.92 లక్షల నుంచి రూ.3.06 లక్షల ప్యాకేజీతో వేతనం ఉంటుందన్నారు. ఆర్‌అండ్‌డీ సెల్ డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, అవంతి ఫుడ్స్ హెచ్‌ఆర్ ఎస్.శశిభూషణ్, హెటిరో హెచ్‌ఆర్ అబ్బాస్, శశి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గో డిజిటల్ ఇన్సూరెన్స్‌కు భారీ వడ్డన

కాకినాడ లీగల్: సమయానికి రిజిస్ట్రేషన్ చేయని కారణంగా కారుకు ఇన్సూరెన్స్ ఇవ్వడానికి నిరాకరించిన బీమా సంస్థకు వినియోగదారుల కమిషన్ భారీగా వడ్డించింది. వివరాలివీ.. తాళ్లరేవు మండలం సుంకరపాలేనికి చెందిన పెద్దిరెడ్డి లోవరాజు రాజమహేంద్రవరం కంటిపూడి మోటార్స్‌లో 2019 నవంబర్ 13న కియా కారు కొనుగోలు చేశారు. దీనికి టెంపరరీ రిజిస్ట్రేషన్‌తో పాటు గో డిజిటల్ సంస్థ ద్వారా ఏడాది కాలానికి ఇన్సూరెన్స్ తీసుకున్నారు. టెంపరరీ రిజిస్ట్రేషన్ గడువు 30 రోజులు కాగా, ఆ కారుకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం 2020 ఫిబ్రవరి 12న లోవరాజు దరఖాస్తు చేశారు. అనంతరం 2020 ఏప్రిల్ 9న కారుకు ప్రమాదం జరిగింది. దీంతో ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయగా.. కారుకు సమయానికి రిజిస్ట్రేషన్ చేయలేదనే కారణంతో బీమా చెల్లించడానికి గో డిజిటల్ సంస్థ నిరాకరించింది. దీనిపై లోవరాజు 2021 జూన్ 28న కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను న్యాయవాది ద్వారా ఆశ్రయించారు. కారు మరమ్మతులకు రూ.10,83,322, షోరూములో కారు ఉంచడానికి అయిన అద్దె, డ్యామేజీల నిమిత్తం రూ.5 లక్షలు, కోర్టు ఖర్చులు కలిపి 9 శాతం వడ్డీతో ఇప్పించాలని కోరారు. విచారణ అనంతరం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాధితుడు లోవరాజు కోరిన దానికి మించి రూ.14,43,098 బీమాతో పాటు.. 2020 మార్చి 20 నుంచి చెల్లింపు తేదీ వరకూ 9 శాతం వడ్డీ చెల్లించాల్సిందిగా గో డిజిటల్ ఇన్సూరెన్స్ కంపెనీని వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు.

## సీఎం జగన్ చిత్రపటానికి మాదిగల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం క్షీరాభిషేకం చేశారు. మాదిగలు 2017లో గుంటూరులో కురుక్షేత్ర మహాసభ నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న సమయంలో నాటి సీఎం చంద్రబాబు ఆదేశాలతో టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లపాలు చేసిందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ గుర్తు చేశారు. నాటి తప్పుడు కేసులు ఎత్తివేయాల్సిందిగా బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు కోరగా, ముఖ్యమంత్రి జగన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆ కేసుల ఎత్తివేతకు హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ నేతలు చేట్ల రామారావు, ఆకుమర్తి సత్యనారాయణ, ముమ్మిడివరపు సుధీర్ పాల్గొన్నారు.

## ఏటీఎంల వద్ద కేటుగాళ్లు

మండపేట: ఏటీఎంల వద్ద నగదు చోరీలకు పాల్పడుతున్న కేటుగాళ్లను మండపేట పోలీసులు గుర్తించారు. ఇద్దరు యువకులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.65 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కె.అప్పారావు కథనం ప్రకారం.. ఈ నెల 4న పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వచ్చిన పోలిశెట్టి సత్యనారాయణకు డబ్బులు డ్రా చేయడం రాలేదు. దీంతో అక్కడే ఉన్న యువకుడిని ఏటీఎం నుంచి డబ్బులు తీయాలని కోరాడు. తర్వాత తన అకౌంట్ నుంచి రూ.11 వేల నగదు చోరీ అయినట్టు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సీఐ కె.శ్రీధర్‌కుమార్ పర్యవేక్షణలో రెండు బృందాలుగా నిందితుల కోసం గాలించారు. పెదపర్తి సమీపాన కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బొంకల మునికుమార్, సీపాల ఈశ్వరయ్యలను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మండపేటతో పాటు వరంగల్, మెదక్, కర్నూలు, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో ఏటీఎంల వద్ద చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. రాష్ట్రంలో వివిధ పోలీస్ స్టేషన్లలో వారిపై ఐదు కేసులున్నాయని ఎస్సై తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, ఆలమూరు కోర్టులో హాజరు పరిచారు.